క్లుప్తంగా

నవధాన్యాల సాగుతో మేలు



వెంగళరాయపురంలో రైతులకు సూచనలిస్తున్న ఏఓ

బలిజిపేట: వ్యవసాయంలో నవధాన్యాల సాగు ఎంతో మేలు చేస్తాయని ఏఓ శ్రావణ్‌కుమార్ అన్నారు. వెంగళరాయపురంలో వ్యవసాయ, వెలుగు, ప్రకృతి వ్యవసాయ శాఖల గ్రామ స్థాయి సమన్వయ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలకు సంబంధించి వివిధ రకాల విత్తనాలను వేయడం వల్ల ఎకరాకు సుమారు ఎనిమిది మెట్రిక్ టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభించడంతో పాటు జీవ వైవిధ్యం, భూమిలో సేంద్రీయ కర్బన శాతం పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది లక్ష్మి, తిరుపతి, వీఏఏలు, వీఓఏలు, రైతులు పాల్గొన్నారు.

అందరిపై అమ్మవారి ఆశీస్సులు ఉండాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: బంగారమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖసంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వయిజర్ కమిటీ సభ్యులు, మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. పట్టణంలోని బంగారమ్మ తల్లి అమ్మవారి 18వ వార్షికోత్సవంలో రాజన్నదొర గురువారం పాల్గొన్నారు. రాజన్నదొరకు అర్చకులు శాస్త్రోక్తంగా వేదమంత్రాల మంత్రోచ్ఛరణతో వేద ఆశీర్వచనం పలికి స్వాగతించారు. అమ్మవారికి రాజన్నదొర ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న శిక్షణ ఎస్‌ఐలు

మక్కువ: స్థానిక సువర్ణముఖి నది సమీపంలోని మూడు రోడ్ల కూడలి వద్ద గురువారం శిక్షణ పొందుతున్న ఎస్‌ఐలు పి.గోపి, ఎస్.నాగరాజు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఏజెన్సీ గ్రామాల నుంచి వచ్చిన వాహనాలను నిలుపుదల చేసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఎక్కడ నుంచి ఎక్కడికి ప్రయాణిస్తున్నారో వాహనదారులు నుంచి వివరాలను తెలుసుకున్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్‌లు పరిశీలించారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మితిమీరిన వేగంతో ప్రయాణించరాదన్నారు. వారి వెంట హెచ్‌సీ రాజేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాలూరు: పట్టణంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ గోపాలరావు నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్యామలాంబ పండగ పనుల నేపథ్యంలో ఆటోనగర్ సబ్‌స్టేషన్‌లో 11కేవీ శివాలయం ఫీడర్ పరిధిలో గల ప్రాంతాలన్నింటికీ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు దీన్ని గుర్తించి సహకరించాలని కోరారు.

పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించండి



అనంతరాయుడుపేటలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం శంకరరావు

సీతానగరం: తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధి వేతనదారులను గాదెలవలస ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శంకరరావు కోరారు. మండలంలోని అనంతరాయుడుపేట, ఏగోటివలస, పూనుబుచ్చింపేట, కేఎస్ పురం, దయానిధిపురం, జయంతిపురం గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాల వద్దకు గురువారం ఆయన తన సిబ్బందితో వెళ్లి పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని అభ్యర్థించారు. తమ పాఠశాలలో ఉన్న సదుపాయాలను వివరించారు. ఆయన వెంట ఆ పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

అక్షరాలా.. రూ. 5కోట్లకు పైగా...

- ఉపాధి బకాయిలు
- మెటీరియల్ పనులకు రూ.4 కోట్లకు పైగా..
- వేతనాలకు రూ.1.26 కోట్లకు పైగా..



బలిజిపేట చెరువులో పని చేస్తున్న వేతనదారులు

బలిజిపేట:

గ్రామాల్లో వలసల నివారణకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రూ.కోట్లలో బకాయిలు పేరుకుపోతున్నాయి. బలిజిపేట మండలంలోన కూలీలకు చెల్లించిన బిల్లులు సుమారు రూ.1.26 కోట్ల వరకు ఉన్నాయి. గోశాలలు, పల్లె పండగ పనులకు సంబంధించి మరో రూ.4.32 కోట్ల వరకు పనులు చేసే వారికి రావాల్సి ఉంది. రోజువారీ మస్తర్లు వేస్తూ బిల్లులు కంప్యూటర్లో జనరేట్ చేస్తున్నా.. డబ్బులు మాత్రం కూలీల ఖాతాల్లో జమ కావడం లేదు. దీంతో ఉపాధి వేతనదారులు నెలల తరబడి ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్నారు. మండలంలో వేలాది మంది వేతనదారులు పనులు చేస్తున్నా.. నిధుల విడుదలలో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది. నెలల తరబడి వేతన బకాయిలు విడుదల చేయకపోవడంతో వేతనదారులు రోజువారి అవసరాల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వేలాది మంది వేతనదారులకు రోజు వారి కూలి గరిష్ఠంగా రూ.307 వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత సిబ్బందికి జిల్లా అధికారులు సూచిస్తున్నారు. అయినా మండలంలో సరాసరి వేతనం రూ.256ల వరకే లభిస్తోంది. ఈ లెక్కన ఒక్కో వేతనదారుకు రూ.వేలల్లో బకాయిలు పేరుకుపోయాయి. ఒక్కో కుటుంబం నుంచి ఇద్దరేసి ఉపాధి పనులకు వెళ్తున్నారు. ఇలా పనులకు వెళ్తున్న వేతనదారులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.1.26కోట్ల వరకు ఉన్నట్టు అధికారుల అంచనా. ఇవి కాకుండా ఉపాధి పథకంలో భాగంగా పలు అభివృద్ధి పనులు రోడ్లు, మినీ గోకులాల నిర్మాణాలు, కాలువ తదితర పనులు చేపట్టారు. వీటి బకాయిలు సుమారు రూ.4.32 కోట్ల వరకు ఉన్నట్టు అంచనా. గత ఆర్థిక సంవత్సరం ముగిసినా వేతన బకాయిలు విడుదల చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని వేతనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉండగా..ఉపాధి వేతనదారులకు పనుల వద్ద మౌలిక సదుపాయాల కల్పన కరువయ్యాయి. మండుతున్న ఎండల్లో పనులు చేస్తున్న వారికి టెంట్లు, నీరు, ప్రథమ చికిత్స కిట్లు ఎక్కడా కనిపించడం లేదు. దీంతో వేతనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

ఉపాధి పనులకు		
సంబంధించిన గ్రూపులు	:	420
జాబ్‌కార్డులు కలిగిన వారు	:	14,013
ఏక్టివేషన్‌లో ఉన్న కార్డుదారులు	:	13,615
వేతనదారులు	:	18,622 మంది
ప్రస్తుతం పనిచేస్తున్న వేతనదారులు	:	11,227 మంది

నెలాఖరుకు బకాయిలు విడుదల కావొచ్చు..

ఏప్రిల్ నెలాఖరుకు ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బకాయిలు విడుదలయ్యే అవకాశం ఉంది. అన్ని పనులకు సంబంధించి బిల్లులను ఇప్పటికే అప్‌లోడ్ చేశాం. బిల్లుల రావడమే ఆలస్యం. వెంటనే ఖాతాల్లో జమవుతాయి.

– కేశవరావు, ఏపీఓ, ఉపాధి పథకం, బలిజిపేట

సోలార్ విద్యుత్ పేనల్‌కు 500 మంది రిజిస్ట్రేషన్లు



మాట్లాడుతున్న ఏడీఈ సిహెచ్.వెంకటరమణ

సీతానగరం: ఏపీ ఈపీడీసీఎల్ పరిధిలో ఉన్న పార్వతీపురం విద్యుత్ డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులకు ప్రోత్సహిస్తున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణాలకు ఇస్తున్న ప్రోత్సాహాన్ని వినియోగించుకోవాలని డీఈఈ చింతా వెంకటరమణ కోరారు. పార్వతీపురం డివిజన్ పరిధిలోని సీతానగరం సబ్ స్టేషన్‌ను గురువారం ఆయన సందర్శించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఏపీ ఈపీడీసీఎల్ విద్యుత్ శాఖ నుంచి విద్యుత్ వినియోగదారులకు వస్తున్న నెలవారీ బిల్లుల కంటే తక్కువగా గిట్టుబాటవుతుందని, అదనంగా విద్యుత్ ఉత్పత్తి అయితే ఏఈపీపీ డీసీఎల్ శాఖ కొనుగోలు చేస్తుందన్నారు. ఉచితంగా విద్యుత్ వినియోగించుకోవచ్చని అన్నారు. డివిజన్ పరిధిలో కొమరాడ, సీతానగరం, గరుగుబిల్లి, పార్వతీపురం, టౌన్, పార్వతీపురం మండలాల నుంచి సోలార్ పవర్ పేనల్‌ను విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను విద్యుత్ వినియోగదారులు 500 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. ఆయన వెంట ఏఈ పి.శశిభూషణరావు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వైద్యాధికారిణికి గాయాలు



వైద్యాధికారిణి సాహితీని 104లో ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి, తెలగడవలస గ్రామాల మధ్య గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి వైద్యాధికారిణి సాహితికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. శంబర పీహెచ్‌సీ వైద్యాధికారిణి సాహితి గురువారం ఎర్రసామంతవలసలో వైద్య శిబిరానికి హాజరై, విధులు ముగించుకొని తిరిగి శంబర పీహెచ్‌సీకి వస్తుండగా, మార్కొండపుట్టి, తెలగడవలస గ్రామాల మధ్య స్పీడ్ బ్రేకర్ల వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో పడిపోయారు. ఈ ప్రమాదంలో ఆమె గాయాల పాలయ్యారు. 104 వైద్య సిబ్బంది అటుగా వస్తూ గమనించి వైద్యాధికారిణి సాహితీని మక్కువ పీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అందించిన అనంతరం పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఆటోబోల్తా పడి పది మందికి గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

సీతానగరం:

జాతీయరహదారిపై సీతానగరం మండలం అనంతరాయుడుపేట జంక్షన్ సమీపంలో గురువారం సాయంత్రం ఆటో బోల్తా పడడంతో జరిగిన రోడ్డు ప్రమాదంలో పదిమంది గాయాల పాలయ్యారు. ఈ ఘటనపై స్థానిక పోలీసులు తెలిపిన సమాచారం మేరకు చినభోగిలి ఏపీజీవీబీ నుంచి బయల్దేరి ప్రయాణికులతో వెళ్తున్న సమయంలో రోడ్డు మధ్యలో ఆటోను డ్రైవర్ కంట్రోల్ చెయ్యలేక ట్రాక్టర్‌ను వెనుకనుంచి ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. దీంతో ఆటోలో ఉన్న పది మంది ప్రయాణికులకు స్వల్పగాయాలు కాగా క్షతగాత్రులను సమీపంలోని బొబ్బిలి సీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు. ప్రమాదంలో గాయపడిన పైడితల్లి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.రాజేష్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

గ్రామసభల ద్వారా అభివృద్ధి పనులు



గ్రామసభలో మాట్లాడుతున్న సీహెచ్‌ఓ రమణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామసభలతోనే అభివృద్ధి పనులు చేపట్టడానికి ప్రాధాన్యతిచ్చామని స్థానిక పీహెచ్‌సీ సీహెచ్‌ఓ ఎస్‌వి.రమణ అన్నారు. మండలంలోని పెదబోగిలి, కొత్తవలస గ్రామాల్లో సభలు గురువారం నిర్వహించారు. పెదబోగిలిలో సర్పంచ్ జె.తేరేజమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనులు చేపట్టడానికి ముందుగా గ్రామసభలు నిర్వహించడం జరిగిందన్నారు. గ్రామ సభల్లో ప్రజాభిప్రాయాలను సేకరించిన తరువాతనే ప్రణాళికల ఆధారంగా అభివృద్ధి పనులు, వైద్య శిబిరాలు, పారిశుధ్య పనుల నిర్వహణకు సభలు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..



కల్యాణ వేదికల వద్ద ఏర్పాటు చేస్తున్న డెకరేషన్లు

- ప్రారంభమైన శుభ ముహూర్తాలు
- ఏప్రిల్ 18 నుంచి జూన్ 8 వరకు వివాహాల సందడి
- విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో వేల సంఖ్యలో జరగనున్న పెళ్లిళ్లు
- జూన్ 11 నుంచి మొదలుకానున్న ఆషాఢం
- మరలా జూలై 25న వచ్చే శ్రావణమాసంలో ప్రారంభంకానున్న ముహూర్తాలు
- జోరందుకున్న బంగారు, వస్త్ర వ్యాపారాలు

వీరఘట్టం: వివాహం ప్రతి ఒక్కరి జీవితంలో మధురానుభూతి. వధూవరులకు అతి పెద్ద పండగ. పిల్లల వివాహాలను వైభవంగా అందరూ మెచ్చుకునేలా చేయాలని తల్లిదండ్రుల ఆరాటం. అందుకే కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లిళ్లు చేస్తుంటారు. ప్రస్తుతం ఏప్రిల్ నెల నుంచి శుభముహూర్తాలు రావడంతో పెళ్లిళ్లను అంగరంగ వైభవంగా చేసుకునేందుకు కొత్త జంటలు సిద్ధమవుతున్నాయి. ప్రతి ఏటా ఎక్కువగా వేసవి సీజన్‌కు పెళ్లిళ్లకు అనువుగా ఉంటుంది. అయితే గతేడాది వేసవిలో అధిక శూన్యమాసం రావడంతో పెళ్ళిళ్ల సంఖ్య తగ్గాయి. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు వరుస ముహూర్తాలు ఉండడంతో వివాహాలు జోరందుకున్నాయి.

వేల సంఖ్యలో వివాహాలు...

ఏప్రిల్‌లో 6 ముహూర్తాలు, మే నెలలో 15 శుభ ముహూర్తాలు, జూన్ నెలలో మరో 6 ముహూర్తాలు ఉన్నాయి. జూన్ 11 నుంచి జూలై 12 వరకు ఆషాఢం కావడంతో శుభకార్యాలకు ఎటువంటి ముహూర్తాలు లేవని పురోహితులు చెబుతున్నారు. మరలా జూలై 25 నుంచి శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరిపించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలు రిజర్వ్ చేసుకుంటున్నారు. డెకరేషన్, క్యాటరింగ్, మంగళ వాయిద్యాలకు అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

జోరుగా వ్యాపారం..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ రెండు జిల్లాల్లో రోజుకు రూ.5 నుంచి రూ.7 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నట్లు వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, వీరఘట్టం ప్రాంతాల్లో బంగారం, వస్త్ర వ్యాపారాలు జోరందుకున్నాయి. అలాగే భజంత్రీలు, ఫ్లవర్ డెకరేటర్లు, పురోహితులు, వంట మాస్టర్లు, స్వీట్లు, ఫొటో, వీడియోగ్రాఫర్లు, కల్యాణ మండపాలకు మంచి డిమాండ్ పెరిగింది.

ఇవీ శుభ ముహూర్తాలు...

ఏప్రిల్ నెలలో 16, 18, 20, 21, 23, 30 తేదీల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయి

మే నెలలో 1, 3, 4, 8, 9, 10, 11, 14, 16, 19, 21, 23, 24, 30 వరకు ముహూర్తాలున్నాయి.

జూన్ నెలలో 2, 4, 5, 6, 7, 8 వరకు ముహూర్తాలు ఉన్నాయి.

ఈ మూడు నెలల్లో అధికం..



గతేడాది వేసవి కంటే ఈ ఏడాది వేసవి మూడు నెలల్లో అధిక ముహూర్తాలున్నాయి. ముఖ్యంగా మే నెలలో 15 ముహూర్తాలు ఉన్నాయి. ముహూర్తాలు ఎక్కువ కావడంతో పురోహితులను సమకూర్చడం కష్టంగా మారుతోంది.

– ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి, యజ్ఞకర్త, వీరఘట్టం

● మున్సిపల్ కార్మికుల ఆందోళన



మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సాలూరులో గురువారం ఆందోళన చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జరిగిన కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి శంకర్, అధ్యక్షుడు రాముడు, ఇతర నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

– సాలూరు

● అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



గుమ్మలక్ష్మీపురం: డిగ్రీ కళాశాల విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

అగ్ని ప్రమాదాల నివారణపై అగ్నిమాపక సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టింది. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లో సిబ్బంది ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డెమో ప్రదర్శనల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



పార్వతీపురం రూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రమణారావు

పార్వతీపురం: ఆర్టీసీ కార్మికుల అక్రమ సస్పెన్షన్‌ను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు డి.రమణారావు ఆర్టీసీ డీఎంను కోరారు. స్థానిక సుందరయ్య భవనంలో ఏఎస్‌డబ్ల్యూఎఫ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిపో మేనేజర్ కార్మికులను 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా సస్పెండ్, ట్రాన్స్‌ఫర్లు చేస్తున్నారన్నారు. ఈ క్రమంలో భాగంగా ఏఎస్‌టీ బాబును అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. గతంలో డిపోలో జరుగుతున్న అనేక అక్రమాలపై అడ్డుపడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను వ్యతిరేకిస్తున్న ఏఎస్టీ బాబుపై డిపోలో పని చేస్తున్న జేఎం రావుతో తప్పుడు ఫిర్యాదు చేయించి, దాని ఆధారంగా ఏఎస్టీ బాబును సస్పెండ్ చేయడం అన్యాయమన్నారు. ఈ చర్యను సీఐటీయూ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ పట్ల డిపో మేనేజర్ కక్షపూరితమైన చర్య చేపట్టారన్నారు. కార్మికులు విధి నిర్వహణలో తప్పుడు కార్యక్రమాలు చేపడితే శాఖాపరమైన చర్యల్లో భాగంగా నోటీసులు ఇవ్వాలే తప్ప ఒకేసారి సస్పెండ్ చేయడం చట్టవిరుద్ధమన్నారు. అక్రమ సస్పెన్షన్ రద్దు చేసి విధుల్లోకి తీసుకొనేంత వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పీఎస్‌వీ పరమేశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘ నాయకుడు కె.రామస్వామి, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్‌కుమార్ డీవైఎఫ్‌ఐ నాయకుడు పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు రేషన్ పంపిణీ

జియ్యమ్మవలస రూరల్:

మండలంలోని గిరిజన గ్రామాలకు ఈకేవైసీ సమస్యపై నిలుపుదల చేసిన రేషన్ సరుకులు గురువారం డిపో నంబర్ 4027 పరిధిలో పంపిణీ చేశారు. టీకేజమ్ము రేషన్ డిపో కాంట్రాక్టు సేల్స్‌మాన్ జె.గోపాలరావు ఎండీయూ వాహనం ద్వారా టీకే జమ్ము పరిధిలో గల గొర్లి, గొర్లివలస, కూటం, పాంద్రసింగి, కోడిపిల్లగూడ, జమ్మువలస, చిన్నదోడిజ, పెద్దదోడిజ గ్రామాలకు చెందిన 563 రేషన్‌కార్డులకు పూర్తి స్థాయిలో నిత్యావసర సరుకులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈకేవైసీ సమస్యతో సక్రమంగా సరుకులను పంపిణీ చేయలేకపోయామని, మరో రెండు రోజుల్లో పూర్తి స్థాయిలో పంపిణీ చేస్తామని తెలిపారు.

విద్యుత్ అంతరాయంతో అధికారులకు తిప్పలు

జియ్యమ్మవలస రూరల్:

విద్యుత్ సరఫరా సరిగా లేకపోవడంతో తహసీల్దార్, ఎంపీడీఓ, విద్యాశాఖ కార్యాలయాల్లో పనులు సరిగ్గా జరగడం లేదని సిబ్బంది అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సమస్యతో నెట్‌వర్క్ పనిచేయక అనేక ప్రభుత్వ నిర్వహణ కార్యక్రమాలను ఆన్‌లైన్ చేయలేకపోతున్నామని తెలిపారు. అంతేకాకుండా రెవెన్యూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులకు పనులు జరగక వెనుదిరుగుతున్నారని, నిత్యం ఇంటర్నెట్ అవసరమైన కార్యాలయాలకు కనీసం జనరేటర్ లేకపోవడం ఏమిటని ప్రజలు అధికారులను నిలదీస్తున్నారని తెలిపారు. మరోపక్క ఎప్పుడో ఏర్పాటు చేసిన ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న జనరేటర్ పనిచేయక మూలన పడింది. సంవత్సరాల తరబడి మరమ్మతులకు గురైన జనరేటర్‌ను కనీసం అధికారులు బాగు చేయించకపోవడం శోచనీయమని వారు చెబుతున్నారు.

ఇద్దరి అరెస్ట్

పాలకొండ: స్థానిక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గురువారం దాడులు చేపట్టి సారా తయారు చేస్తున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..భామిని మండలానికి చెందిన బిడ్డిక రవి, బిడ్డిక కొండలరావులను అరెస్ట్ చేసి, 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే వెయ్యి లీటర్ల పులిసిన బెల్లం ఊటలను ధ్వంసం చేశామన్నారు. బెల్లం విక్రయాలు చేపడుతున్న షణ్ముక అనే వ్యక్తిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సిబ్బందితో పాటు మొబైల్ టీమ్‌కు చెందిన మురళి, కొత్తూరు సీఐ కిరణ్మయి, శ్రీకాకుళం సీఐ లీలారాణి, సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.